సాక్షి
రాజన్న సిరిసిల్ల

శనివారం । 19 । ఏప్రిల్ । 2025



గంభీరావుపేట: రాజుపేట కొనుగోలు కేంద్రంలో తడిసిన వరి ధాన్యం

అకాల వర్షం.. ఆగమాగం

జిల్లాలో శుక్రవారం ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వర్షం అన్నదాతలను ఆగమాగం చేసింది. కొన్ని చోట్ల రోడ్లపై చెట్లు విరిగిపడగా.. వరి పంటలకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. రాజుపేట, ముస్తాబాద్, పోతుగల్, గూడెం, నామాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. మద్దికుంటలో మామిడికాయలు నేల రాలాయి. అటు రోగాలు, ఇటు వర్షాలతో పంటలు దెబ్బతిని ఎకరానికి ఒక ట్రాక్టర్ వడ్లు కూడా వచ్చే పరిస్థితి లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

– గంభీరావుపేట/రుద్రంగి/ముస్తాబాద్/ఇల్లంతకుంట



గంభీరావుపేట: నర్మాల రోడ్డుకు అడ్డంగా పడ్డ చెట్టు



ముస్తాబాద్: నేల రాలిన వరి



రుద్రంగి: ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు



భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే

జిల్లావ్యాప్తంగా క్రైస్తవులు శుక్రవారం గుడ్ ఫ్రైడేను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. జిల్లా కేంద్రంలోని బీవై నగర్‌లో గల బేతస్థ చర్చిలో శ్యామ్‌కల్వల ఆధ్యాత్మిక సందేశం అందించారు. క్రీస్తు ఆదర్శాలు జీవితకాలం పాటు అనుసరణీయాలు అని ఉద్బోధించారు – సిరిసిల్ల కల్చరల్

న్యూస్‌రీల్

అంబేడ్కర్ ఆదర్శనీయుడు



అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే సత్యం

బోయినపల్లి(చొప్పదండి): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ అందరికీ ఆదర్శనీయుడని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. శుక్రవారం మండలంలోని విలాసాగర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంబేడ్కర్ చూపిన బాటలో యువత ముందుకు నడవాలని కోరారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేణుగోపాల్, నాయకులు కనుకయ్య, రవీందర్, ప్రశాంత్‌కుమార్, అంజన్‌రావు, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, అంబేద్కర్ సంఘ నాయకులు విక్రం, జోగు శంకర్, రవి, ప్రవీణ్, రామస్వామి, కల్లెపెల్లి సతీశ్, కొంకటి మధు, సురేశ్, రాజు, వెంకటరమణ, మల్లికార్జున్, కనుకయ్య, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి



బీడీ కంపెనీ గోదాంలో అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

సిరిసిల్ల: అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సిరిసిల్ల అగ్నిమాపక కేంద్రం అధికారి ఎన్.నరేందర్ అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎల్‌పీజీ గ్యాస్ గోదాం, బీడీ కంపెనీ గోదాముల్లో సిబ్బందికి అవగాహన కల్పించారు. అగ్నిప్రమాదాలు వేసవిలో ఎక్కువగా జరుగుతాయని, వాటి వల్ల ఆస్తి, ప్రాణనష్టాలు ఉంటాయని వివరించారు. ముందు జాగ్రత్తలతో నష్టాలను తగ్గించవచ్చని సూచించారు. ఏదైన అగ్నిప్రమాదం జరిగితే వెంటనే ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.


పేదలకు సన్నబియ్యం పథకం ఓ వరం



తంగళ్లపల్లి గంగాభవానీ ఆలయంలో మెట్టు సాయికుమార్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): నిరుపేదలకు సన్నబియ్యం పథకం ఓ వరమని రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గంగాభవానీ ఆలయంలో జరిగిన కల్యాణోత్సవంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇందిరమ్మకాలనీలోని గడ్డం మధూకర్ ఇంటిలో ప్రభుత్వం సరఫరా చేసిన సన్నబియ్యంతో భోజనం చేశారు. గంగపుత్ర సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం




మాట్లాడుతున్న ట్రేడ్ యూనియన్ల నాయకులు

సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం తథ్యమని జిల్లాలోని ట్రేడ్ యూనియన్ల నాయకులు అన్నారు. మే 20న చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్మికభవన్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు అధ్యక్షత వహించగా కార్మిక నాయకులు మాట్లాడారు. దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను మార్చి 4 కోడ్‌లుగా విభజించి, దేశ కార్మికులను ఎఫ్‌డీఐలకు బానిసలుగా చేసే విధంగా కుట్ర చేసిందన్నారు. ఈనేపథ్యంలో అన్ని కార్మిక సంఘాలు పోరాడాల్సిన అవసరం వచ్చిందని తెలిపారు. కార్మికులందరూ దేశవ్యాప్త సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, మీసం లక్ష్మణ్, సీఐటీయూ నాయకులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, ఆకుల రాములు, దశరథం, ప్రసాద్, రుక్మిణి, వెంగల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముందుకు.. వెనక్కి!

- కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వే లైన్ కోసం కదులుతున్న ఫైళ్లు
- సిరిసిల్లలో 751 ఎకరాల సేకరణకు రూ.400 కోట్లు వెచ్చింపు
- దాచారం నుంచి బోయినపల్లి వరకు భూమిని గుర్తించిన అధికారులు
- మరో 107 ఎకరాల కోసం రూ.69కోట్లు అవసరం
- మిడ్‌మానేరులో 37ఎకరాలకు బదులుగా కోనరావుపేటలో భూమి
- కరీంనగర్‌లోనూ 50 ఎకరాలు సేకరించిన అధికారులు



సాక్షిప్రతినిధి,కరీంనగర్:

కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వేలైన్ భూసేకరణలో అధికారులు కాస్త వేగం పెంచినట్లు కనిపిస్తోంది. ఈ పనుల్లో నెలకొన్న జాప్యాన్ని చూస్తుంటే.. ఒకడుగు ముందుకుపడితే.. రెండడుగులు వెనక్కి అన్నట్లుగా ఉంది పరిస్థితి. ప్రస్తుతమైతే ఈ పనుల కోసం ఇటు సిరిసిల్ల, కరీంనగర్ జిల్లాలో రెవెన్యూ అధికారులు దస్త్రాలను చకచకా ముందుకు కదుపుతున్నారు. ప్రస్తుతం సిరిసిల్ల జిల్లాలో పనులు కొనసాగుతున్నాయి. దాచారం నుంచి బోయినపల్లి వరకు దాదాపు 954 ఎకరాల భూమిని అధికారులు రైల్వేలైన్ కోసం గుర్తించగా ఇప్పటి వరకూ 751 ఎకరాలు సేకరించారు. భూములు కోల్పోయిన రైతులు, నిర్వాసితులకు రూ.400 కోట్ల వరకు ప్రభుత్వం చెల్లించింది. రైల్వేలైన్ కోసం దాదాపు 107ఎకరాల భూమిని ఇప్పటికే అధికారులు గుర్తించారు. ఈ భూమికి పరిహారంగా మరో రూ.69 కోట్ల వరకు నిర్వాసితులకు చెల్లించాల్సి ఉంటుంది. ప్రభుత్వం నుంచి ఈ నిధులు విడుదల కావాల్సి ఉంది. ఇవి వస్తే భూసేకరణ ప్రక్రియ మరింత వేగవంతమవుతుంది. మరోవైపు మిడ్‌మానేరు పరిధిలోని చింతల్‌మెట్, తాడూరు పరిధిలోని దాదాపు 37ఎకరాల అటవీభూమిని సేకరించారు. ఇందకోసం ప్రత్యామ్నాయంగా కోనరావుపేటలో మరో 40 ఎకరాల భూమిని అటవీ ప్రాంతంగా అభివృద్ధి చేసేందుకు అప్పగించారు.

కరీంనగర్‌లో 50 ఎకరాలకు రూట్ క్లియర్

కొత్తపల్లి- మనోహరాబాద్ రైల్వేట్రాక్ కోసం గంగాధర మండలం ఉప్పర మల్యాల రెవెన్యూ గ్రామం పరిధిలోని ఉప్పరమల్యాల, రంగారావుపల్లెలో 50.19 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొలిక్కి వచ్చింది. ఈ భూమిలో కొత్తపల్లి- వేములవాడ మధ్య ఐదు కిలోమీటర్ల రైల్వే ట్రాక్‌ను అధికారులు నిర్మించనున్నారు. ఈ భూమితోపాటు ఇక్కడ ఉన్న 23 ఇళ్లను ప్రభుత్వం రైల్వేశాఖకు అప్పగించడంతో పనులు మొదలు కానున్నాయి. ఇంటికి రూ.15లక్షలు, ఎకరానికి రూ.20 లక్షల చొప్పున చెల్లిస్తున్నారు. గత సెప్టెంబరులో ఈ భూమిపై అభ్యంతరాలపై నోటిఫికేషన్ వేసిన ప్రభుత్వం గ్రామసభలతో కొలిక్కి తీసుకొచ్చింది. వేములవాడ నుంచి వచ్చే ఈ ట్రాక్ గంగాధర సమీపంలోని కొత్తపల్లి స్టేషన్‌కు అనుసంధానం చేయడంతో మార్గం పూర్తవుతుంది.

సిరిసిల్ల వరకు పనులు నత్తనడకే

మనోహరాబాద్- కొత్తపల్లి వరకు దాదాపు 151 కిలోమీటర్లకు రూ.1167 కోట్లతో 2016లో ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రస్తుతం 79కిలోమీటర్ల మేర ట్రాక్ పనులు పూర్తయి.. సిద్దిపేట వరకు రైలు సర్వీసు అందుబాటులోకి వచ్చింది. సిద్దిపేట నుంచి సిరిసిల్ల వరకు జల, రోడ్ల మార్గాలు అధికంగా ఉన్న కారణంగా ఇక్కడ కల్వర్టులు, వంతెనలకు నిధుల విడుదల్లో జాప్యంతో పనులు ఆలస్యంగా నడుస్తున్నాయి. షెడ్యూల్ ప్రకారం.. 2023 మార్చిలోనే రైల్వే పనులు సిరిసిల్ల వరకు పూర్తికావాలి. సిద్దిపేట నుంచి కొత్తపల్లి వరకు ట్రాక్ పనులు పూర్తయేందుకు దాదాపు రూ.850 కోట్ల వరకు నిధులు అవసరం అవుతాయని దక్షిణమధ్య రైల్వే అంచనా వేస్తోంది. ఈ లెక్కన చూస్తే.. కొత్తపల్లి వరకు ట్రాక్ పనులు పూర్తయ్యేందుకు మరో రెండేళ్లు పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మార్గం పూర్తయితే రాజధానితోపాటు జగిత్యాల మీదుగా ముంబై, పెద్దపల్లి మీదుగా ఢిల్లీ, వరంగల్‌కు మార్గం సుగమం అవుతుంది.

ఇందిరమ్మ ఇళ్లకు బిల్లులు విడుదల

- 24 మంది లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున మంజూరు
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా



లాల్‌సింగ్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల: జిల్లాలో బేస్‌మెంట్ వరకు ఇంటి నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న 24 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు రూ.లక్ష చొప్పున ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని కలెక్టర్ సందీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రతీ మండలంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఒక గ్రామాన్ని ఎంపిక చేసి అర్హులకు మంజూరు పత్రాలు పంపిణీ చేశామని తెలిపారు. 300 మంది ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించగా, 24 మంది బేస్‌మెంట్ వరకు పూర్తి చేయడంతో వారికి మొదటి విడతగా రూ.లక్ష చొప్పున వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేశామని వివరించారు. నాలుగు దశలలో రూ.ఐదు లక్షల ఆర్థిక సాయాన్ని గ్రీన్ ఛానల్ ద్వారా విడుదల చేస్తుందన్నారు. హౌసింగ్ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించి, నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చూడాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలి

వీర్నపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సూచించారు. శుక్రవారం వీర్నపల్లి మండల కేంద్రంలో మహిళా స్వశక్తి భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. లాల్‌సింగ్‌తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. అక్కడే ఉన్న గిరిజన మహిళ తన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి విద్యుత్ తీగలు అడ్డు వస్తున్నాయని కలెక్టర్ దృష్టికి తీసుక రాగా మీ సమస్యను పరిష్కారం చేస్తామని అన్నారు. పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసి ఓపీ రిజిష్టర్, సిబ్బంది రిజిష్టర్‌లను పరిశీలించారు. పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించాలని వైద్యులకు సూచించారు. కస్తూ రిభా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగదిలో సరుకులు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులతోమాట్లాడి మెనూ ప్రకారం భోజనాలు పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. కస్తూరిబా విద్యాలయంలోని పై అంతస్తులోని తరగతి గదులకు పరిశీలించేందుకు వెళ్తున్న సందర్భంగా ఇక్కడ ఉన్న తేనెటీగలు ఒకేసారి లేవడంతో కలెక్టర్‌ను తన భద్రత సిబ్బంది వెంటనే ఓ తరగతి గదిలోకి తీసుకెళ్లారు. కార్యక్రమాల్లో హౌసింగ్ పీడీ శంకర్, డీఆర్డీవో శేషాద్రి, మండల ప్రత్యేక అధికారి, జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి రాందాస్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్యనారాయణగౌడ్, ప్రజా ప్రతినిధులు కేకే మహేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ రాముల నాయక్, తహసీల్దార్ ముక్తర్ పాషా, ఎంపీడీవో వాజిద్, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కాలువలు పరిశీలన

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం దాచారం బానప్ప చెరువును కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా శుక్రవారం పరిశీలించారు. తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ ఎల్లమ్మ చెరువులోకి నీరు వెళ్లేలా కాలువలు పూడిక తీయాలని ఇరిగేషన్ ఈఈని ఆదేశించారు. కలెక్టర్ వెంట కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయాల చైర్మన్ నాగుల సత్యనారయణ, రైతులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై సర్కారు సవతి ప్రేమ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: రాష్ట్ర సాధన ఉద్యమకారులపై రాష్ట్ర ప్రభుత్వం సవతి ప్రేమ చూపెడుతోందని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సిరిసిల్ల నియోజకవర్గం ఇన్‌చార్జి వెంగళ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం సిరిసిల్లలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాక ముందు మేనిఫెస్టోలో పెట్టిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు ప్రభుత్వం ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం మంజూరు చేయాలని, ఉద్యమకారుల సంక్షే మ బోర్డు ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని, ఉద్యమకారులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారులకు ఇచ్చిన హామీ లనె నెరవేర్చాలని కోరుతూ ఈనెల 21న హైదరాబాద్‌లో ప్లీనరీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్లీనరీ పోస్టర్లను ఆవిష్కరించి అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం పోరం రాష్ట్ర నాయకుడు ఆకునూరి శంకరయ్య, నాయకులు భాస్కర్, కందుకూరి రామగౌడ్, వెంగళ లక్ష్మణ్, మామిడాల రమణ, బింగి ఇజ్జగిరి, పోరండ్ల రమేశ్, సిరిపురం గంగారాజం, వేముల చెన్నయ్య పాల్గొన్నారు.

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిరావాలి



మాట్లాడుతున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు

రుద్రంగి(వేములవాడ): వరంగల్‌లో ఈనెల 27న నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. శుక్రవారం రుద్రంగి మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ స్థాపించి 25 ఏళ్లు అవుతున్న సందర్భంగా బహిరంగ సభ వేదిక ద్వారా కేసీఆర్ ప్రసంగిస్తారని తెలిపారు. అనంతరం మండల నాయకులతో కలిసి బహిరంగ సభ పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో మండల మండల ప్రజాపతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిలువ నీడ లేదాయే..

- కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కరువు
- తీవ్ర ఎండలకు ఇబ్బంది పడుతున్న రైతులు
- చాలీచాలని టార్పాలిన్లు
- జిల్లాలో 240 ధాన్యం కేంద్రాలు



చలువ పందిళ్లు లేని ముస్తాబాద్ ధాన్యం సేకరణ కేంద్రం



ఎండకు తాళలేక వ్యాన్ నీడలో రైతులు కూర్చున్నది ముస్తాబాద్ మండల కేంద్రంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం. తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన రైతులకు నిలువ నీడ లేక ఇలా వ్యాన్ నీడలో కాసేపు ఎండ నుంచి ఉపశమనం పొందుతున్నారు. తాగునీటిని సైతం ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారు. పందిళ్లు ఎప్పుడు వేస్తారోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముస్తాబాద్(సిరిసిల్ల): జిల్లాలోని ధాన్యం సేకరణ కేంద్రాల్లో రైతులకు నిలువ నీడ కరువైంది. తాగేందుకు నీరు లేక ఇంటి నుంచి తెచ్చుకుంటున్నారు. వారం రోజుల క్రితం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన అధికారులకు రైతులకు కనీస సౌకర్యాలు కల్పించలేదు. పందిళ్లు వేయలేదు. తాగునీటిని సైతం చాలా మంది రైతులు ఇంటి నుంచే తెచ్చుకుంటున్నారు. మరోవైపు టార్పాలిన్లు సైతం కేంద్రాల్లో లేవు. హఠాత్తుగా వర్షం కురిస్తే ధాన్యం తడిసిపోవాల్సిందే.

అకాల వర్షాలకు తడవాల్సిందే..

జిల్లాలోని కొనుగోలు కేంద్రాలకు స్థానిక మార్కెటింగ్ కమిటీల ద్వారా టార్పాలిన్లు సరఫరా చేస్తున్నారు. సహకార సంఘాల కేంద్రాలైతే.. వారే ఆ బాధ్యతను తీసుకుంటున్నారు. జిల్లాలోని చాలా కేంద్రాల్లో టార్పాలిన్లు తీసుకునేందుకు నిర్వాహకులు ఇష్టపడడం లేదు. ప్రస్తుతానికైతే వడగండ్ల, అకాల వర్షాల సూచనలు ఉండగా, మార్కెటింగ్ శాఖ ద్వారా టార్పాలిన్లు సరఫరా చేస్తున్నారు. చాలా మంది రైతులు తీసుకున్న టార్పాలిన్లు తిరిగి ఇవ్వకపోవడంతో, నిర్వాహకుల నుంచి ఆ డబ్బులను వసూలు చేస్తున్నారు. దీంతో సెంటర్ నిర్వాహకులు పరిమిత సంఖ్యలో టార్పాలిన్లు తీసుకుంటుండడంతో రైతులందరికీ అందడం లేదు.



కొండాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రం

రైతులపై భారం

ధాన్యం ఆరబోసుకునేందుకు రైతులే పరదాలు తెచ్చుకుంటున్నారు. ఒక్కో పరదాకు రోజుకు రూ.20 చొప్పున అద్దె చెల్లిస్తున్నారు. ఇలా ధాన్యం తూకం జరిగి, లోడ్ చేసే వరకు దాదాపు పది రోజులు పట్టే అవకాశం ఉంటుంది. ఇన్ని రోజులు పరదాల అద్దె రైతులే భరించాల్సి వస్తోంది. కొన్ని కేంద్రాల్లో బస్తాకు 42 కిలోలు కాంటా పెడుతుండగా.. మరికొన్న చోట్ల 42.500 కిలోల ధాన్యం తీసుకుంటున్నారు. ధాన్యాన్ని జాలిపట్టని చోట్ల అదనంగా కిలోన్నర తీసుకుంటున్నట్లు నిర్వాహకులు పేర్కొంటున్నారు. చాలా చోట్ల పేరుకే చిన్నపాటి పందిరి వేస్తుండగా, అత్యధిక కేంద్రాల్లో అది కూడా కనిపించడం లేదు. చెట్టునీడన, వాహనాల కింద ఎండ నుంచి కాపాడుకోవడం కనిపిస్తోంది. ఎండ దెబ్బతగిలి డీహైడ్రేషన్‌కు గురైతే ఏంటి పరిస్థితి అని రైతులు ప్రశ్నిస్తున్నారు.

పది రోజులుగా ఎండలో ఉంటున్నాం



కొండాపూర్ కేంద్రానికి వడ్లు తీసుకొచ్చి పది రోజులైంది. ఇంకా కాంటా పెట్టలేదు. ఎండలో ఇబ్బందిపడుతున్నాం. మూడు పరదాలు కిరాయికి తీసుకున్నాను. రోజుకు రూ.60 కడుతున్న. గాలి, దుమారం వస్తే టార్పాలిన్లు లేవు. చెట్ల కిందనే ఉంటున్నం.

– కట్కూరి నర్సయ్య, కొండాపూర్

వర్షం వస్తే ధాన్యం తడుసుడే



ముస్తాబాద్ ఐకేపీ కేంద్రంలో చలువపందిరి వేయలేదు. ఎండలో రైతులు ఇబ్బంది పడుతున్నారు. టార్పాలిన్లు రాలేవంటున్నారు. వర్షం పడితే ధాన్యం తడిసిపోతుంది. కేంద్రంలో కనీస వసతులు కల్పించి, రైతులను ఆదుకోవాలి. చల్లని నీరు అందుబాటులో ఉంచాలి.

– వెంకటేశ్, ముస్తాబాద్

చలువ పందిరి వేయిస్తాం



ఎండల నుంచి రైతులను కాపాడేందుకు చలువ పందిళ్లు వేయిస్తాం. ఇంకా కొన్ని కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి చేయిస్తున్నాం. టార్పాలిన్లు పూర్తిస్థాయిలో రాలేదు. తాగునీటిని ఏర్పాటు చేశాం. పాడీక్లీనర్ లేనిచోట సంచికి 42 కిలోలు తూకం వేస్తున్నారు.

– రాజ్యలక్ష్మి, ఐకేపీ, సీసీ, ముస్తాబాద్



పోషకాహారంతో ఆరోగ్యం

బోయినపల్లి(చొప్పదండి): నమతుల పోషకాహారం తీసుకుంటే తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని వేములవాడ ఐసీడీఎస్ సీడీపీవో సౌందర్య పేర్కొన్నారు.



చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ: ఈనెల 27న నిర్వహించే చలో వరంగల్ బహిరంగసభ పోస్టర్‌ను బీఆర్ఎస్ వేములవాడ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆవిష్కరించారు.

గరిష్టం/కనిష్టం

38.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. రాత్రి వేళ ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

గ్రామ కమిటీలతో నేర నియంత్రణ

- జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాధిక జైస్వాల్



కోనరావుపేట(వేములవాడ): నేరాల నియంత్రణకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి రాధిక జైస్వాల్ పేర్కొన్నారు. కనగర్తిలో మానేరు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఒక్కసారి కేసులో ఇరుక్కుంటే కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందన్నారు. బాల్యవివాహాలను ప్రోత్సహించిన వారికి రెండేళ్ల వరకు జైలు, జరిమానా ఉంటుందని హెచ్చరించారు. లోక్‌అదాలత్ సభ్యుడు చింతోజు భాస్కర్ మాట్లాడుతూ సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకుంటే.. కేసు కొట్టేయడంతోపాటు కోర్టు ఫీజు వాపస్ వస్తుందని తెలిపారు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్ రెడ్డి, సిరిసిల్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాస్‌రావు, న్యాయవాదులు విజయ్, ఆంజనేయులు, క్రాంతికుమార్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ భూంరెడ్డి, కార్యదర్శి కవితారెడ్డి, మాజీ సర్పంచ్ బాపురెడ్డి, ఉపసర్పంచ్ దేవరాజు పాల్గొన్నారు.

వేములవాడ సబ్‌జడ్జిగా అజయ్‌కుమార్

వేములవాడ: వేములవాడ సబ్‌జడ్జిగా అజయ్‌కుమార్‌ను నియమిస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటి వరకు ఇన్‌చార్జీగా లక్ష్మణాచారి వ్యవహరించారు. ఆయన స్థానంలో అజయ్‌కుమార్ నియమితులయ్యారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల ఖాతాల్లోకి నగదు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని ఇందిరమ్మ ఇళ్ల పథకం పైలట్ గ్రామం రాళ్లపేటలో బేస్‌మెంట్ స్థాయికి ఇంటి నిర్మాణం పూర్తిచేసిన లబ్దిదారుల ఖాతాల్లోకి గురువారం నగదు జమైనట్లు ఎంపీడీవో కె.లక్ష్మీనారాయణ తెలిపారు. రాళ్లపేటలో 102 మందిని ఎంపిక చేయగా 52 మంది పనులు ప్రారంభించారని.. 9 మంది బేస్‌మెంట్ వరకు పూర్తిచేయగా వారి ఖాతాల్లో మొదటి విడతగా రూ.లక్ష చొప్పున జమైనట్లు తెలిపారు.

ఎయిర్‌ఫోర్స్‌లో ఖాళీలు

సిరిసిల్లకల్చరల్: ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ సంగీత విభాగంలో పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసినట్లు జిల్లా యువజన క్రీడలశాఖ అధికారి అజ్మీర రాందాస్ తెలిపారు. ఈనెల 21 నుంచి వచ్చే నెల 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. http://agnipathvayu.cdac.in పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న అభ్యర్థులకు ప్రీ రిక్రూట్‌మెంట్ ర్యాలీలో పాల్గొనేందుకు ప్రావిజనల్ అడ్మిట్‌కార్డు పొందే వీలుంటుందని తెలిపారు. బెంగళూరు, న్యూఢిల్లీలో జరిగే ర్యాలీలో పాల్గొని సంగీత విభాగంలోని అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం



సిరిసిల్లటౌన్: పోషణ పక్షోత్సవాల్లో భాగంగా గురువారం సుభాష్‌నగర్ సెక్టార్ పరిధిలోని పెద్దూరు అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ జాతర, అన్నప్రాసన, సామూహిక సీమంతాలు, అక్షరాభ్యాసం నిర్వహించారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం మాట్లాడుతూ గర్భిణీలు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భవతి అని తెలిసినప్పటి నుంచే అంగన్‌వాడీ కేంద్రంలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. సీడీపీవో ఉమారాణి, సూపర్‌వైజర్ దివ్య, అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎదురుగట్ల మమత, టీచర్లు మంజుల, అన్నపూర్ణ, శాంత, నాగలక్ష్మి, విజయ, పద్మ, సునీత, రేణుక, రాధ, చిట్టి, పుష్పలత, జ్యోతి, సురేఖ, మహేశ్వరి పాల్గొన్నారు.

ఆస్పత్రిలో ఫైర్‌సేఫ్టీ అవసరం

సిరిసిల్లక్రైం: జన రద్దీ అధికంగా ఉండే ఆస్పత్రిలో ఫైర్‌సేఫ్టీ అవసరమని సిరిసిల్ల స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేందర్ స్పష్టం చేశారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సిరిసిల్లలోని పలు ఆస్పత్రుల్లో గురువారం ఫైర్‌సేఫ్టీపై అవగాహన కల్పించారు. అనుకోకుండా అగ్ని ప్రమాదం జరిగితే వాటి నుంచి తప్పించుకునేందుకు అవసరమైన అత్యవసర ద్వారాలను ఏర్పాటు చేయాలని సూచించారు.

కలెక్టరేట్‌లో లీకువీరుడు!

- సిరిసిల్లలో ఏళ్లుగా పాతుకుపోయిన అధికారి
- ఆయన శాఖలో తరచుగా లోపాలు గుర్తిస్తున్న కార్యాలయం
- అటెన్షన్ డైవర్షన్ కోసం కార్యాలయంపై దుష్ప్రచారం
- సీఎం, మంత్రుల పర్యటనల సమయంలో ఇదే తంతు
- ధరణి, లే అవుట్ల విషయంలో పలుమార్లు భంగపాటు
- ప్రభుత్వానికి నివేదిక పంపేందుకు సిద్ధమవుతున్న కలెక్టర్?



సాక్షిప్రతినిధి,కరీంనగర్:

రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ కొంతకాలంగా పలుసంచలనాలు, వివాదాలకు కేంద్రంగా నిలుస్తున్న విషయం తెలిసిందే. ఓ అధికారి తీరే ఈ వివాదాలకు కేంద్ర బిందువుగా నిలుస్తోందని కార్యాలయ సిబ్బంది చర్చించుకుంటున్నారు. కొన్నినెలలుగా సిరిసిల్ల కలెక్టరేట్‌లో జరుగుతున్న పలు పరిణామాలను, విధాన పరమైన నిర్ణయాలను తప్పుడుగా ప్రచారం చేస్తున్న అధికారిపై కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఆగ్రహంగా ఉన్నారు. ఈ విషయంలో కలెక్టర్ సైతం అతని తీరుపై గుర్రుగా ఉన్నారని, జరుగుతున్న పరిణామాలపై ప్రభుత్వానికి నివేదిక పంపే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఇపుడు ఈ విషయం సిరిసిల్ల కలెక్టరేట్‌లో చర్చానీయాంశంగా మారింది.

ఇంతకీ ఎవరాయన?

ఐదారేళ్లుగా సిరిసిల్ల జిల్లాలో పాతుకుపోయిన సదరు అధికారికి స్థానిక రాజకీయ నాయకులతో మంచి పరిచయాలు ఉన్నాయి. దీంతో వారికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా భూవివాదాలకు సంబంధించిన విషయాల్లో సదరు అధికారి అమితాసక్తి ప్రదర్శిస్తున్నట్లు సమాచారం. తన శాఖలో ఏం జరుగుతుందన్న విషయం గాలికి వదిలి.. నిత్యం ధరణి, లే అవుట్ల విషయంలో తల దూరుస్తూ.. వివాదాస్పద విషయాలను కార్యాలయానికి అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారని కలెక్టరేట్ వర్గాలు గుర్తించాయి. ఆయన పనిలో ఎపుడు లోపాల్ని గుర్తించినా.. వెంటనే తనపై ఎవరూ శ్రద్ధ పెట్టకుండా.. వెంటనే కలెక్టర్ కార్యాలయంపై ఏదో తప్పుడు ప్రచారం చేసి, తనపై చర్చ జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వారాంతాల్లో హైదరాబాద్‌కు వెళ్లడం, కలెక్టర్ కార్యాలయానికి లీవులపై కనీస సమాచారం ఇవ్వకపోవడం, ప్రభుత్వ సమీక్షాసమావేశాలకు తరుచుగా ఆలస్యంగా వస్తుండటంతో అతని తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో రెండుసార్లు ఎమ్మెల్సీ, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు జరిగినా ఆయన బదిలీ కాకపోవడం గమనార్హం.

భూములంటే అమితాసక్తి..

ఇటీవల ధరణి రికార్డుల్లో మార్పులు చేర్పులు, లేఅవుట్ల విషయంలో కలెక్టరేట్‌లో ఆయన అత్యూత్సాహం ప్రదర్శిస్తున్నారని కార్యాలయ సిబ్బంది గుర్తించారు. ఒక సందర్భంలో ఏకంగా కలెక్టర్ అనుమతి లేకుండా ధరణిలో రికార్డులు మార్చేందుకు సదరు అధికారి సిబ్బందిపై ఒత్తిడి తెచ్చారు. కానీ.. రికార్డులు మార్చే అధికారి ముందుజాగ్రత్తగా.. కలెక్టర్‌కు సమాచారం ఇవ్వడంతో అసలు విషయం వెలుగుచూసింది. పెద్దూరు, అగ్రహారంలో పలువురు ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారికి సహకరించిన విషయాన్ని కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ముందస్తుగానే పసిగట్టడంతో అక్కడ ఆయన ఆటలు సాగలేదు. తన అక్రమాలు, శాఖలో లోపాలు బయటపడ్డ ప్రతీసారీ.. కలెక్టర్ కార్యాలయంలో ఏదో జరిగిపోతుందని తప్పుడు ప్రచారంచేసి ఇతరులపై దృష్టి మరల్చేలా చేస్తున్నారని సమాచారం. ఆ మధ్య సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలో భోజన ఖర్చులపై దుమారం, ఇటీవల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి పర్యటన సందర్భంగానూ.. జరిగిన పరిణామాల వెనుక సదరు అధికారే ఉన్నారని కలెక్టర్ కార్యాలయం గుర్తించింది. తమకు తరచుగా ఆటంకాలు కలిగిస్తున్న ఆ అధికారిని సరెండర్ చేయాలని నివేదిక పంపేందుకు కలెక్టర్ సిద్ధమవుతున్నారని విశ్వసనీయ సమాచారం.

ప్రొటోకాల్ వివాదంతో ఉద్రిక్తత



ఘర్షణ పడుతున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

గంభీరావుపేట(సిరిసిల్ల): బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాల మధ్య ప్రొటోకాల్ వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించేందుకు గురువారం ఐకేపీ అధికారులు, సిబ్బంది, కాంగ్రెస్ నాయకులు చేరుకున్నారు. అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులు పెద్దవేని వెంకటి, గోగు లింగం, వెంకటస్వామిగౌడ్ కేంద్రంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై ఎమ్మెల్యే కేటీఆర్ ఫొటో ఎందుకు పెట్టలేదని అధికారులను ప్రశ్నించారు. ఫ్లెక్సీని తొలగించాలని కోరగా.. స్పందన రాకపోవడంతో వారే తొలగించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పోలీసులు అక్కడికి చేరుకొని బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య నేతృత్వంలో వివిధ మండలాల నుంచి ఆ పార్టీ నాయకులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఠాణాకు వచ్చి బీఆర్ఎస్ నాయకులపై ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎస్సై ప్రేమానంద్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భూ సమస్యలకు సత్వర పరిష్కారం

- భూ భారతి చట్టంపై విస్తృత ప్రచారం
- ఆధార్‌లా భూమికి భూధార్ సంఖ్య
- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- బోయినపల్లిలో అవగాహన సదస్సు



బోయినపల్లిలో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

బోయినపల్లి(చొప్పదండి): భూ సమస్యల సత్వర పరిష్కారానికి ధరణి స్థానంలో వచ్చిన భూభారతి నూతన ఆర్వోఆర్ చట్టంపై విస్తృత ప్రచారం కల్పిస్తున్నట్లు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా పేర్కొన్నారు. మండలకేంద్రంలోని రైతువేదిక భవనంలో భూభారతి (రికార్డు ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) కొత్త ఆర్వోఆర్ చట్టం 2025పై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ నూతనచట్టంపై ఈనెల 17 నుంచి 29 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. భూసమస్యలపై అధికారులు అందించిన ఆర్డర్లపై భూభారతి చట్టం ద్వారా ఆర్డీవోలు, కలెక్టర్ల నిర్ణయంపై భూమి ట్రిబ్యునల్‌కు అప్పీల్ చేసుకోవచ్చని తెలిపారు. గతంలో ఉన్న ధరణిలో రికార్డుల్లో సవరణకు అవకాశం లేదని, సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సిందేనని గుర్తుచేశారు. అప్పీల్ వ్యవస్థతో సంతృప్తి చెందకపోతే సివిల్ కోర్టులకు వెళ్లవచ్చన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో గ్రామపరిపాలన అధికారులను నియమిస్తారని, ఆధార్ కార్డు లాగా భూమికి భూధార్ సంఖ్య కేటాయింపుతో భూఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని తెలిపారు. ఎకరం భూమి మ్యూటేషన్‌కు రూ.2500 ఫీజు చెల్లించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు రాధాభాయి, రాజేశ్వర్, తహసీల్దార్ నారాయణరెడ్డి, డీటీ భూపేశ్, ఏఎంసీ చైర్మన్ ఎల్లేశ్‌యాదవ్, సెస్ డైరెక్టర్ కొట్టేపెల్లి సుధాకర్, ఎంపీడీవో భీమ జయశీల, ఎంఏవో ప్రణిత తదితరులు పాల్గొన్నారు.

'భూ భారతి'పై అవగాహన సదస్సులు

సిరిసిల్ల: జిల్లా వ్యాప్తంగా 'భూ భారతి'పై మండల స్థాయిలో అవగాహన సదస్సులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా నిర్వహిస్తున్నారు. ఈనెల 19న ఇల్లంతకుంట, 21న కోనరావుపేట, 22న రుద్రంగి, చందుర్తి, 23న వేములవాడ, వేములవాడరూరల్, 24న గంభీరావుపేట, 25న ముస్తాబాద్, 26న తంగళ్లపల్లి, 28న సిరిసిల్ల, 29న ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి మండలాల్లో సదస్సులు నిర్వహించనున్నారు.

సబ్బండ వర్గాలతో రజతోత్సవ సభ

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య



సిరిసిల్లలో సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నేతలు

సిరిసిల్లటౌన్: వరంగల్‌లో నిర్వహించే పార్టీ రజతోత్సవ సభకు సిరిసిల్ల నుంచి సబ్బండ వర్గాలు హాజరవుతారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య పేర్కొన్నారు. సిరిసిల్ల తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న జరిగే పార్టీ రజతోత్సవ సభ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, రాష్ట్ర నాయకులు గూడూరి ప్రవీణ్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళ, నాయకులు ఆకునూరి శంకరయ్య, దార్నం లక్ష్మీనారాయణ, మ్యాన రవి, ఎండీ సత్తార్, బొల్లి రామ్మోహన్, మంచె శ్రీనివాస్ పాల్గొన్నారు.

సభకు తరలిరావాలి

గంభీరావుపేట(సిరిసిల్ల): వరంగల్ సభకు మండలం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. గంభీరావుపేటలో పార్టీ ముఖ్య నాయకులతో సమావేశమయ్యారు. పార్టీ మండలాధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, నాయకులు గంధ్యాడపు రాజు, కొమిరిశెట్టి లక్ష్మణ్, మోతె రాజిరెడ్డి, దయాకర్‌రావు, రత్నాకర్, రాజేందర్, సత్యం పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ముస్తాబాద్(సిరిసిల్ల): ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య కోరారు. ముస్తాబాద్‌లో మాట్లాడారు. రైతుభరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాడే లేదన్నారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సురేందర్‌రావు, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, పట్టణాధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యుడు కొమ్ము బాలయ్య, మాజీ ఎంపీపీ శరత్‌రావు, ఆర్‌బీఎస్ మాజీ అధ్యక్షుడు గోపాల్‌రావు, నాయకులు విజయరామారావు, సర్వర్, మల్లేశ్, జానబాయి, సుమతి, నర్సయ్య, సంతోష్‌రావు, చెవుల మల్లేశ్ పాల్గొన్నారు.

రెండు ఇసుక రీచ్‌లకు త్వరలోనే అనుమతులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలో త్వరలోనే రెండు ఇసుక రీచ్‌లకు అనుమతులు ఇచ్చేందుకు అధికారులు నిర్ణయానికి వచ్చారు. మొన్నటి వరకు వెంకటాపూర్ ఇసుక రీచ్ నుంచి రెవెన్యూ అధికారులు అనుమతులు ఇవ్వగా.. ఆ గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో కొన్ని రోజులుగా మండలంలో ఇసుక తరలింపునకు అనుమతులు ఇవ్వడం లేదు. ఈ నేపథ్యంలోనే గురువారం తహసీల్దార్ సుజాత, ఎస్సై రమాకాంత్, ఇసుక రవాణాదారులతో సమావేశమయ్యారు. వెంకటాపూర్, పదిరలలో ఇసుక రీచ్‌లకు రెండు రోజుల్లో అనుమతులు ఇవ్వనున్నట్లు తహసీల్దార్ సుజాత తెలిపారు. ఇతర గ్రామాలకు చెందిన ఐదు ట్రాక్టర్లకు కూడా అనుమతులు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఆవేశం అదే క్షణం ఆవేదన జీవితాంతం

- చిన్నచిన్న కారణాలకే బలవన్మరణాలు
- ఒంటరవుతున్న పిల్లలు, తల్లిదండ్రులు
- ఉమ్మడి జిల్లాలో ఆందోళన కలిగిస్తున్న ఆత్మహత్యలు

- 'ఏడాదిన్నర వయసు ఉన్న బిడ్డకు ఉరివేసి, అదే తాడుకు తల్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఇటీవల పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగింది. తాను ఒక్కగా ఉన్నాననే బాధతో మనస్తాపం చెంది అఘాయిత్యానికి పాల్పడింది'.
- 'ఈనెల 11న రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎల్కలపల్లి గేట్ గ్రామానికి చెందిన వివాహిత భర్త వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకుంది. దీంతో ముగ్గురు పిల్లలు తల్లిలేని బిడ్డలయ్యారు'.
- 'గత నెల 6న చొప్పదండి మండలానికి చెందిన ఇద్దరు ప్రేమికులు తమ ప్రేమను పెద్దలు అంగీకరించడం లేదని మనస్తాపం చెంది ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఇలా ఓ కష్టం .. ఓ నష్టం.. ఆవేదన, ఆవేశం, ఆక్రోశం, మనిషిని తన ప్రాణం తాను తీసుకునేలా చేస్తోంది. దీంతో వారిపై ఆధారపడిన వారు ఒంటరవుతున్నారు. క్షణికావేశంలో తీసుకున్న నిర్ణయం.. వారి కుటుంబాలను జీవితాంతం ఆవేదన మిగుల్చుతోంది.

...వీరంతా బతకాల్సిన వారే

సాక్షి ,పెద్దపల్లి:

అనారోగ్యంతో కొందరు, కుటుంబ కలహాలతో మరికొందరు, అప్పుల బాధ, నిరుద్యోగం, పరీక్షల్లో ఫెయిల్, ప్రేమలో విఫలం, ఇష్టం లేని పెళ్లితో ఇంకొందరు.. వరకట్న వేధింపులు, అవమానం, ఆవేశం ఇలా కారణాలు ఎన్ని ఉన్నా మానసిక ఒత్తిడిలో బలహీనమైన క్షణంలో బలమైన నిర్ణయాలతో ప్రాణాలు తీసుకుంటున్నారు. ఆత్మహత్యలతో ఆయా కుటుంబాలు పెద్దదిక్కును కోల్పోయి ఇబ్బందులు పడుతున్నాయి. మహిళలు ఆత్మహత్య చేసుకుంటే వారి పిల్లలు అనాథలవుతున్నారు. ప్రేమ, ఉద్యోగం, పరీక్షలు తదితర కారణాలతో యువత ఆత్మహత్యలకు పాల్పడి తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారు.

రోజూ ఇద్దరు..

ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రపంచంలో సంవత్సరానికి 8లక్షల మందికి పైగా, అంటే ప్రతీ సెకనుకు ఒకరు ఆత్మబలిదానం చేసుకుంటున్నారు. ప్రపంచంలో జరిగే ప్రతి 4 ఆత్మహత్యల్లో ఒకటి ఇండియాలోనే నమోదవుతోంది. ఉమ్మడి జిల్లాలో గతేడాది 776 మంది సూసైడ్ చేసుకున్నారు. అంటే సగటున ప్రతీ రోజుకు ఇద్దరు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏదో కారణంతో తమ ప్రాణాలు తీసుకుంటున్నారు.

నివారిద్దాం ఇలా..

నిరాశ, నిస్పృహల్లో ఉన్నవారికి స్వాంతన కలిగించడం ద్వారా ఆత్మహత్యలను తగ్గించవచ్చు. ఆత్మహత్య ఆలోచన రావడమే తరువాయి వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా వారిని మన వైపు మళ్లించవచ్చు. వారి బాధలను వినాలి, అర్థం చేసుకోవాలి. వారి సమస్యకు ఎలా పరిష్కారం దొరుకుతుందో వారితోనే చెప్పించాలి. ఇలాంటివారిని గుర్తించగానే ఒంటరిగా ఉంచకుండా నలుగురితో కలిసేలా కుటుంబసభ్యులంతా స్నేహంగా మెలగాలి. వారు సాధారణ జీవితం గడిపేంత వరకు వారిని గమనిస్తూ ఉండాలి. సమస్య మరీ తీవ్రంగా ఉంటే మానసిక వైద్యులను కలిసి చికిత్స ఇప్పించాలి.

కౌన్సెలింగ్ తీసుకుంటే తప్పేంటి..

ఆత్మహత్య ఆలోచనలు వెంటాడుతున్న వారికి వీలైతే మానసిక వైద్యుడితో కౌన్సెలింగ్ ఇప్పించాలి. కానీ, మనదగ్గర మానసిక వైద్యం అంటే నామోషీ. మానసిక వైద్య చికిత్స అంటే.. అదేదో పిచ్చిపట్టినవాళ్లకు అందించే చికిత్స అనే భావన ప్రజల మెదళ్లలో నాటుకుపోవడం వల్లే ఈ సమస్య ఎక్కువ అవుతుంది. ఆత్మహత్యకు ముందు కొంతమంది ప్రదర్శించే నిర్దిష్ట లక్షణాలను అర్థం చేసుకోవడం ద్వారా చాలావరకు బలవన్మరణ కేసులను నివారించే అవకాశం ఉంటుందని మానసిక వైద్య నిపుణులు పేర్కొంటున్నారు.

గుర్తించడం ఇలా..

ఆత్మహత్య గురించి పదేపదే మాట్లాడుతుండటం, తనకు తాను హాని కలిగించుకునేందుకు ప్రయత్నించడం, తీవ్ర ఒత్తిడితో చికాకు పడుతుండటం, ఒంటరితనాన్ని ఇష్టపడటం, ప్రతీ విషయం గురించి ప్రతికూలంగా ఆలోచించడం, నిద్రపోకుండా ఉండటం, చేసే ప్రతి పనిపట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తుండడం.. ఇలాంటి మార్పులు ఒక వ్యక్తిలో కనిపిస్తే, వారు ఆత్మహత్య గురించి ఆలోచనలు చేస్తుండొచ్చని భావించాలి.

ఉమ్మడి జిల్లాలో నాలుగేళ్లలో ఆత్మహత్యలు ఇలా..

జిల్లా	2022	2023	2024	2025 (ఇప్పటి వరకు)
పెద్దపల్లి	242	278	266	36
కరీంనగర్	300	274	262	38
జగిత్యాల	72	64	48	74
సిరిసిల్ల	181	151	200	37



ప్రతీ సమస్యకు పరిష్కారం



ఆత్మహత్య చేసుకునే ముందు ఒక్క నిమిషం ఆలోచించాలి. ఎంత పెద్ద సమస్య వచ్చినా పరిష్కార మార్గాలు వెతుక్కోవాలి. మానసిక ఒత్తిడి పెరిగినప్పుడు మానసిక నిపుణుల సూచనలు తీసుకోవడం మంచిది. ఆత్మహత్య చేసుకోవాలనుకునే సమయంలో తమను నమ్ముకొని ఉన్న అమ్మానాన్నలు, భార్యాపిల్లలు, స్నేహితులను ఐదు క్షణాలు తలుచుకుంటే కొంతమేర మార్పు వస్తుంది.

– రవివర్మ, మానసిక వైద్యనిపుణుడు, జీజీహెచ్ గోదావరిఖని

క్లుప్తంగా

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య


సురేందర్ (ఫైల్)

జమ్మికుంట : రైలు కిందపడి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రామగుండం రైల్వే పోలీస్ హెడ్ కానిస్టేబుల్ గంగారపు తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం...హుజూరాబాద్ పట్టణంలోని మామిడ్లవాడకు చెందిన పొట్ట బత్తిని సురేందర్ (69) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. పట్టణంలోని రైల్వేస్టేషన్ రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని రైలు కిందపడి గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

'పది' ఫలితాలు రాకముందే విద్యార్థిని మృతి

- రూ.10 లక్షలు వెచ్చించినా దక్కని ప్రాణం


ఆకుల నాగచైతన్య (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): పదోతరగతి పరిక్షలు రాసి.. ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థిని ఆకుల నాగచైతన్య (15) అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. బోయినపల్లి మండలం మల్లాపూర్‌కు చెందిన ఆకుల చిన్న రవి–రజిత దంపతులకు ముగ్గురు కూతుళ్లు. చిన్నకూతురు నాగచైతన్య ఆటో ఇమ్యూన్ వ్యాధితో ఏడాదిగా బాధపడుతోంది. గతంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాగచైతన్యకు రూ.2.50లక్షల మేర ఎల్వోసీ ఇచ్చారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో ఏడాదిగా చికిత్స పొందుతోంది. నాగచైతన్య చికిత్స కోసం తల్లిదండ్రులు దాదాపు రూ.10 లక్షల వరకు ఖర్చు చేశారు. గత మార్చిలో 10వ తరగతి పరీక్ష రాసింది. మూడు రోజుల క్రితం వ్యాధి తీవ్రం కావడంతో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించి గురువారం మధ్యాహ్నం మృతిచెందింది. చురుకైన విద్యార్థిని అర్ధంతరంగా ప్రాణాలు వదలడంతో ఆమె చదివిన స్కూల్ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన వ్యక్తి అరెస్ట్

కథలాపూర్: కథలాపూర్ మండలం సిరికొండ గ్రామానికి చెందిన చెరుకూరి శంకర్ విధుల్లో ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించినందుకు గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. ఈనెల 14న సిరికొండలో గొడవ జరుగుతుందన్న సమాచారం మేరకు పోలీసులు వెళ్లారు. శంకర్‌ను గొడవ చేయవద్దని పోలీసులు చెప్పగా.. వారిపై దురుసుగా ప్రవర్తించి విధులకు ఆటంకం కలిగించాడు. శంకర్‌ను గురువారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.


అగ్నిప్రమాదంలో ఈతచెట్లు దగ్ధం


కాలిపోయిన చెట్లను చూపుతున్న గీతకార్మికులు

కథలాపూర్: కథలాపూర్ మండలం సిరికొండ గ్రామశివారులో ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో 400 ఈత చెట్లు కాలిపోయినట్లు గీతకార్మికులు గురువారం తెలిపారు. రోజుమాదిరిగానే బుధవారం సాయంత్రం ఈతచెట్లకు కల్లు గీసేందుకు వెళ్లి ఇంటికి వచ్చామని పేర్కొన్నారు. ప్రమాదవశాత్తు నిప్పంటుకోవడంతో పిచ్చిమొక్కలతోపాటు 400 ఈతచెట్లు కాలిపోవడంతో తాము ఉపాధి కోల్పోయామని వాపోయారు. సంఘటన స్థలాన్ని ఆర్ఐ నాగేశ్ పరిశీలించి వివరాలు సేకరించారు. ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని తెలిపారు.

సాదా.. సీదా..

- కొత్త చట్టంతో దరఖాస్తులకు కలగనున్న మోక్షం
- క్రమబద్ధీకరణతో అన్నదాతలకు భూ హక్కుల వర్తింపు



సాక్షి, పెద్దపల్లి:

తెల్లకాగితాలపై క్రయ విక్రయ ఒప్పందాలు చేసుకున్న (సాదాబైనామా) వ్యవసాయ భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులకు మోక్షం కలగనుంది. సాదాబైనామా ద్వారా భూములను కొనుగోలు చేసిన వారికి పట్టాలు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో స్వీకరించిన దరఖాస్తులను ఏళ్లుగా పట్టించుకోలేదు. దీంతో ప్రభుత్వం అమలు చేస్తున్న రైతుబంధు, ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి, బ్యాంకుల ద్వారా వడ్డీ లేని పంట రుణాలను, ఇతరత్రా సబ్సిడీ పథకాలను రైతులు అందుకోలేకపోయారు. ప్రస్తుతం సాగులో ఒకరు ఉండి, రికార్డుల్లో మరొకరు ఉండటంతో గ్రామాల్లో భూవివాదాలు పెరిగాయి. అయితే తాజాగా ప్రభుత్వం తీసుకొచ్చిన భూభారతి పోర్టల్ ద్వారా 90రోజుల్లో వీటిని ఆర్డీవో స్థాయిలో విచారణ చేసి అర్హత ఉన్నవారి నుంచి ప్రస్తుత రిజిస్ట్రేషన్, స్టాంప్ డ్యూటీ వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేయనున్నారు. హక్కుల రికార్డుల్లో నమోదు చేసి పట్టాదారు పాసుపుస్తకం ఇవ్వనున్నారు.

2020 అక్టోబర్‌లో ప్రకటన..

2014 జూన్ 2వ తేదీలోగా తెల్లకాగితాలపై క్రయ, విక్రయాలు జరిపిన రైతుల దరఖాస్తులకు చట్టబద్ధత కల్పించి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ చేయాలనే ఉద్దేశంతో 2020 అక్టోబర్‌లో ప్రకటన జారీ చేసి నవంబరు 10 వరకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఐదేళ్లు అయినా కదలిక లేకపోయింది. వీటిని పరిష్కరించడానికి బీఆర్ఎస్ ప్రభుత్వం కేబినెట్ సబ్‌కమిటీని ఏర్పాటు చేసినా అది ఒక్కసారి కూడా సమావేశం కాలేదు. అయితే కొత్తగా అమల్లోకి వచ్చిన ఆర్వోఆర్–2024 చట్టంలో సెక్షన్ 6 కింద ఆర్డీవో స్థాయి అధికారి విచారించి పరిష్కరించవచ్చని మార్గదర్శకాలు విడుదల చేసింది. దీంతో సాదాబైనామాలకు మోక్షం లభించే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాదాబైనామా దరఖాస్తులు..	
పెద్దపల్లి	35,580
కరీంనగర్	26,871
జగిత్యాల	35,010
సిరిసిల్ల	15,056

భూ వివాదాలకు ప్రధాన కారణం

నాలుగైదు దశాబ్దాల క్రితం వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాల క్రయవిక్రయాలు కేవలం తెల్ల కాగితాల పైనే జరిగేవి. ఆ తర్వాత కొన్నాళ్లకు స్టాంపు పేపర్లపై క్రయవిక్రయ దస్తావేజులు రాసుకునేవారు. తమ పూర్వీకులు ఇతరులకు భూములు విక్రయించినట్లు చిన్న కాగితంపై ఉన్నా వారి వారసులు ఆ భూముల జోలికి వెళ్లేవారు కారు. ఆ పరిస్థితులు మారిపోయాయి. భూముల ధరలు పెరగడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. దీంతో రికార్డుల్లో తమ పేర్లు ఉన్నాయంటూ వారి కొందరు వారసులు తిరగబడుతున్నారు. ఏళ్ల తరబడిగా సాగు చేసుకుంటున్నామని ఇప్పుడు వచ్చి ఆ భూములు తమవి అంటే ఎలా అంటూ వివాదాలు ప్రారంభమయ్యాయి. అనేక మంది రైతులు భూ సమస్యల పైనే నిత్యం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వాటిని సమగ్రంగా పరిశీలించి పరిష్కరిస్తే చాలా సమస్యలకు పరిష్కారం లభించనుంది.

దరఖాస్తు ఇచ్చి ఐదేళ్లయింది



తహసీల్ కార్యాలయంలో సాదాబైనామా కింద దరఖాస్తు ఇచ్చినా పేరున పట్టా చేయమని నాలుగేళ్లుగా ఆఫీసు చుట్టూ తిరుగుతున్నా. ఇప్పటివరకు పట్టా కాలేదు. 10 గుంటల భూమి నా పేరున పట్టా చేయాల్సి ఉంది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరుతున్నా. భూభారతి అయినా నాకు న్యాయం చేస్తుందని భావిస్తున్నా.

– జూపాక ఉమామహేశ్వర్, కాల్వశ్రీరాంపూర్

పట్టా రాలేదు



నాలుగేళ్ల కింద దరఖాస్తు చేసుకున్నాను ఇప్పటివరకు పట్టా చేయలేదు. ఎకరా 30 గుంటలు వ్యవసాయ భూమి కొనుగోలు చేసిన. నా పేరున ఇప్పటికీ పట్టా కాలేదు. తెల్లకాగితాల మీద క్రయవిక్రయాలు చేసుకున్న వారి సమస్యలకు భూభారతి పోర్టల్‌తోనైనా పరిష్కారం చూపాలి.

– కట్కూరి రాజిరెడ్డి, కాల్వ శ్రీరాంపూర్

పథకాలకు దూరం



ఇద్దరి వద్ద నాలుగెకరాల వ్యవసాయ భూమి కొన్న. పట్టా కాలేదు. నాలుగేళ్ల క్రితం సాదాబైనామాలో కొన్న భూమిని నా పేరుపై పట్టా చేయాలని దరఖాస్తు పెట్టుకున్నా నేటి వరకు కాలేదు. దీంతో ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం పొందలేకపోతున్న.

– భూంపెల్లి నర్సయ్య, గుందారం

న్యాయమూర్తులకు వీడ్కోలు


న్యాయమూర్తులకు వీడ్కోలు కార్యక్రమంలో ఘనంగా సత్కరిస్తున్న కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు

కరీంనగర్ క్రైం: ఇటీవల బదిలీ అయిన కరీంనగర్ జిల్లా జడ్జి బి.ప్రతిమ, ఏసీబీ జడ్జి కుమార్ వివేక్, ఫ్యామిలీ కోర్టు జడ్జి లక్ష్మీకుమారిలను గురువారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అసోసియేషన్ అధ్యక్షుడు లింగంపల్లి నాగరాజు, ప్రధాన కార్యదర్శి అరుణ్ కుమార్ ల ఆధ్వర్యంలో కార్యవర్గం జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవాసదన్ భవనంలో కార్యక్రమంలో ముగ్గురు న్యాయమూర్తులను మెమెంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న జిల్లా జడ్జి ప్రతిమ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాకు ఎంతో గుర్తింపుఉందని, ఇక్కడ వృత్తిపరంగా తనకు ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. న్యాయమూర్తులు వెంకటేశ్ నీరజ, శ్రీలేఖ, వాణి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకటేశ్, మేజిస్ట్రేట్లు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఆరెల్లి రాములు, కుమార్, గౌరు రాజిరెడ్డి, ఏజీపీ రమేశ్, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు చందా రమేశ్, సంయుక్త కార్యదర్శి సిరికొండ శ్రీధర్, ట్రెజరర్ ముద్దసాని సంపత్, మహిళా ప్రతినిధి రజి, సీనియర్ న్యాయవాదులు డి.మల్లయ్య, పి.సజన్‌కుమార్, కె.సంజీవరెడ్డి, కొరివి వేణుగోపాల్, బాస సత్యనారాయణ, కుసుంబ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అజ్ఞాతంలోనే నాలుగు దశాబ్దాలు

- ఆధార్ కార్డుకు దిక్కులేదు
- సర్కార్ రివార్డులు దక్కేదెలా..?
- కనికరించాలని కలెక్టర్‌కు వేడుకోలు
- మాజీ మావోయిస్టు వసంత దీనస్థితి

కోరుట్ల: మావోయిస్టుల్లో 1985లో చేరిన జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన పసుల వసంత (68) సుమారు 40 ఏళ్లపాటు అజ్ఞాతంలోనే గడిపారు. 2001లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లా)లోని ఎల్లారెడ్డిపేట మండలం మద్దిమల్ల ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు ఉత్తర తెలంగాణ స్పెషల్ జోన్ కార్యదర్శిగా పనిచేస్తూ భర్త పసుల రాంరెడ్డి చనిపోయినా.. ఆమె ఉద్యమ బాటను వదిలిపెట్టలేదు. ఆయన లేకున్నా.. భర్త అడుగుజాడల్లో మరో పాతికేళ్లపాటు ఉద్యమంలోనే గడిపి చివరగా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం ఉత్తర బస్తర్ డివిజన్ కార్యదర్శిగా పనిచేశారు. వయోభారం, అనారోగ్య కారణాలతో ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లా పోలీసులకు పసుల వసంత 2025 జనవరిలో లొంగిపోయారు. రెండు రోజుల క్రితం ఆమె కోరుట్లలోని తన బంధువుల చెంతకు చేరింది.

ఆధార్‌కార్డు లేనే లేదు..

ఉద్యమబాటలోనే నాలుగు దశాబ్దాలు గడిపిన వసంతకు ఆధార్ కార్డు లేదు. అజ్ఞాతంలో ఉన్న ఆమె ఏనాడూ జనజీవన స్రవంతిలోకి రాకపోవడంతో ఆమెకు ఆధార్‌కార్డు అవసరమే రాలేదు. ఇప్పుడు పరిస్థితి వేరు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ప్రభుత్వం ఇదివరకే వసంత పేరిట రూ.8 లక్షల రివార్డు ప్రకటించింది. దీంతోపాటు తెలంగాణ ప్రభుత్వ పరంగా రూ.ఐదు లక్షల రివార్డు ఉన్నట్లు ఇంటలిజెన్స్ పోలీసులు వసంత కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ రివార్డులు పొందాలంటే వసంతకు ప్రస్తుతం ఆధార్‌కార్డు తప్పనిసరి అయింది. ఉద్యమం నుంచి బయటకు వచ్చిన ఆమెకు కోరుట్లలో నివాస గృహం ఉంది. కోరుట్లలోని అంబేద్కర్‌నగర్‌లో ఉన్న ఇంటి ఆధారంగా రెసిడెన్స్ సర్టిఫికెట్ తీసుకునే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కనికరించాలని వేడుకోలు

కోరుట్లకు చెందిన వసంతకు అత్తగారింటికి చెందిన ఇల్లు తప్ప ఇతరత్రా ఆస్తులు లేవు. ఆ కాలంలో రేషన్‌కార్డు తీసుకోలేదు. భర్త పసుల రాంరెడ్డి సైతం మావోయిస్టు ఉద్యమంలోనే 2001లో చనిపోవడంతో వీరిద్దరికి దాదాపుగా ఆధార్‌కార్డు, రేషన్‌కార్డులు లేకపోవడం గమనార్హం. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కాంకేర్ జిల్లా ఎస్పీ సమక్షంలో లొంగిపోయిన సందర్భంలో అక్కడి ప్రభుత్వం రూ.8 లక్షల రివార్డు ప్రస్తావన వచ్చినట్లు సమాచారం. ఈ సమయంలో ఛత్తీస్‌గఢ్ పోలీసులు వసంత లొంగిపోయినట్లు ఇచ్చిన ధ్రువీకరణ పత్రం ఆధారంగా ఆధార్ కార్డును తయారు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆమె కూతురు భవానీ జిల్లా కలెక్టర్‌ను వేడుకుంటోంది.

ఆధార్ కార్డు ఇప్పించండి



ఉద్యమంలోనే జీవితం గడిచిపోయింది. నాకు ఆధార్ కార్డు, రేషన్‌కార్డు వంటి ఆధారాలు ఏమీ లేవు. పోలీసులకు లొంగిపోయిన నాకు ఆరోగ్య రీత్యా చాలా సమస్యలు ఉన్నాయి. నా పేరిట ఉన్న రివార్డును పొందగలిగితే కొంతలో కొంత నా ఆరోగ్య పరిస్థితిని మెరుగుపర్చుకోవచ్చని ఆశ. ఈ విషయంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నా.

– పసుల వసంత, లొంగిపోయిన మావోయిస్టు

గిన్నిస్‌బుక్ రికార్డులో 'మానేరు' విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న మానేరు విద్యాసంస్థల చైర్మన్

జగిత్యాల: కొడిమ్యాల మండలం పూడూరు గ్రామంలోని మానేరు ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి సర్వీన్ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నాడు. హైదరాబాద్‌లోని అంతర్జాతీయ హలెల్ మ్యూజిక్ స్కూల్ మేనేజ్‌మెంట్ బోర్డు ఈవెంట్‌లో గిన్నీస్ రికార్డుకు ఎంట్రీలను ఆహ్వానించింది. 2024 డిసెంబర్ 1న 1046 మందితో గంటపాటు ఆన్‌లైన్‌లో నాన్‌స్టాప్ కీబోర్డు ప్లే ఈవెంట్‌ను హలెల్ మ్యూజిక్ స్కూల్ నిర్వహించింది. 45 సెకన్లలోనే కీబోర్డును వాయించి గిన్నీస్ వరల్డ్ రికార్డు సృష్టించాడు. ఈ సందర్భంగా విద్యాసంస్థల చైర్మన్ అనంతరెడ్డి, డైరెక్టర్ సునీతరెడ్డి, ప్రిన్సిపాల్ అభినందించారు.

'జ్యోతిష్మతి'కి ఎన్‌బీఏ గుర్తింపు


మాట్లాడుతున్న సాగర్‌రావు

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, సైన్స్‌కు 2028 వరకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్ మంజూరు చేసిందని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, విభాగాలు 2022–2025 మధ్య కాలంలో గుర్తింపు పొందాయన్నారు. నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ ద్వారా పునరుద్ధరించబడిన గుర్తింపు అకాడమిక్ ఎక్స్‌లెన్స్, నాణ్యత హామీ ఫలితాల ఆధారిత విద్యతో మరోసారి పొడిగించారని, అక్రిడిటేషన్ సంస్థ ఆశించిన విద్యా, పరిశోధన ప్రయత్నాలను మెరుగుపరచడానికి శక్తివంతమైన ప్రేరణగా పనిచేస్తోందన్నారు. పొడిగింపు కళాశాల పటిష్టత, అధ్యాపకుల నిబద్ధత, అధునాతన మౌలిక సదుపాయాలు వివిధ కార్యక్రమాలను బలోపేతం చేస్తుందని సెక్రటరీ కరస్పాండెంట్ జె సుమిత్‌సాయి తెలిపారు. కొనసాగింపునకు కృషిచేసినవారికి అభినందనలు తెలిపారు.

కరీంనగర్ ప్రభుత్వాసుపత్రిలో అరుదైన దంత శస్త్ర చికిత్స


శస్త్ర చికిత్స నిర్వహించిన ప్రభుత్వాసుపత్రి వైద్యులు

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ ప్రభుత్వ ప్రధానాసుపత్రిలో అరుదైన దంత శస్త్రచికిత్స నిర్వహించినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వీరారెడ్డి తెలిపారు. మూడేళ్లుగా జీజీహెచ్‌లోని దంత విభాగం ఆరోగ్యశ్రీ సేవల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలుపుకుంటుందన్నారు. ఈక్రమంలో ఆధునిక నైపుణ్యాన్ని అవసరమైన పేషంట్లకు అందించడం జరుగుతుందన్నారు. మొదటిసారిగా అనస్తీసియాలో అత్యాధునిక పద్ధతిలో రోడ్డు ప్రమాదంలో ముఖం, దౌడ, ముక్కు విరిగిన 33 ఏళ్ల శివకుమార్‌కు ఓరల్, మాక్సిలో ఫేషియల్ సర్జన్ డాక్టర్ డి.సతీశ్‌కుమార్ ఓపెన్ రిడక్షన్, ఇంటర్నల్ ఫిక్సేషన్ ద్వారా సర్జరీ నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ శస్త్రచికిత్సలో సీనియర్ ఫిజీషియన్ నవీన, సీనియర్ దంత వైద్య నిపుణులు రవిప్రవీణ్‌రెడ్డి, హఫీజ్, అనిస్తీషియా సతీశ్ కుమార్, వంశీ, సుగాత్రి, ఈఎన్‌టీ సందీప్‌రెడ్డి, జమున తదితరులు పాల్గొన్నారు.

చందుర్తిలో మూడిళ్లలో చోరీ

- రాణాకు కూతవేటు దూరంలో దొంగతనాలు


వివరాలు తెలుసుకుంటున్న సీఐ, ఎస్సై

చందుర్తి(వేములవాడ): చందుర్తి పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలోని మూడిళ్లలో బుధవారం అర్ధరాత్రి దొంగలు పడ్డారు. మండల కేంద్రంలోని రెండిళ్లలో చొరబడ్డ దొంగలు వస్తువులను చిందరవందరగా పడేశారు. సిర్రం రాజవ్వ ఇంట్లో రూ.15వేలు, వెంగళి వినోద ఇంట్లో రూ.25వేలు ఎత్తుకెళ్లారు. చర్చి పాస్టర్ ప్రశాంత్ ఇంటిలోకి ప్రవేశించి ఆరుబయట నిలిపిన బైక్‌ను ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అంజయ్య దొంగతనం జరిగిన ఇళ్లలోని కుటుంబ సభ్యుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అంతేకాకుండా వేలిముద్రల ఆధారంగా దొంగలు పట్టుకునేందుకు క్లూస్‌టీమ్‌తో ఆధారాలను సేకరించారు. మండలకేంద్రంలోని సీసీ ఫుటేజీలను సేకరించి దర్యాప్తు ముమ్మరం చేస్తున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి ఎస్సై అంజయ్య తెలిపారు.

వన్ వే.. సెల్‌ఫోన్ డ్రైవింగ్


ఎదురెదురుగా ఢీకొన్న బస్సు, టిప్పర్


అంబులెన్స్‌లో క్షతగాత్రుల తరలింపు

- ఆర్టీసీ బస్సు.. టిప్పర్ ఢీ
- 27 మంది ప్రయాణికులకు గాయాలు
- కండక్టర్ పరిస్థితి విషమం
- పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట శివారులో ప్రమాదం


ప్రభుత్వాసుపత్రిలో క్షతగాత్రులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి జిల్లా అప్పన్నపేట శివారులో గురువారం ఆర్టీసీ పల్లెవెలుగు బస్సు ఎదురుగా వస్తున్న చెరువుమట్టి టిప్పర్‌ను బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో 27మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. బస్సు ప్రయాణికులు, పోలీసుల కథనం ప్రకారం.. కరీంనగర్ నుంచి గోదావరిఖని వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, జిల్లాలోని అంతర్గాం మండలం ముర్మూరు నుంచి చెరువు మట్టిని రంగాపూర్ ఇటుకబట్టీకి తరలిస్తున్న టిప్పర్‌ను బలంగా ఢీకొట్టింది. ఆ సమయంలో బస్సులో 32 మంది ప్రయాణికులున్నారు. 27మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్సులో పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స తరువాత కొందరిని ఇళ్లకు పంపించారు. కండక్టర్ కూకట్ల శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలు కావడంతో కరీంనగర్‌కు తరలించారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్‌తోనే ప్రమాదం

పెద్దపల్లిలోని శాంతినగర్ నుంచి అప్పన్నపేట వరకు రాజీవ్ రహదారి మరమ్మతు పనులు చేపట్టారు. వాహనాలను వన్ వే లో నడిపిస్తున్నారు. బస్సు డ్రైవర్ నాగేందర్ సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తుండడంతో ప్రమాదం జరిగిందని కమాన్‌పూర్ ప్రాంత ప్రయాణికుడు సదయ్య తెలిపాడు. ప్రమాదంలో 27మంది గాయపడగా 22 మంది మహిళలే ఉన్నారు. పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్యే విజయరమణారావు పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్ శ్రీధర్‌ను ఆదేశించారు. ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై మల్లేశం పర్యవేక్షించారు.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు

పెద్దపల్లి మండలం అప్పన్నపేట శివారులో జరిగిన రోడ్డుప్రమాదంలో గాయాలపాలైన ప్రయాణికులకు పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించారని కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. క్షతగాత్రులు వారి బంధువులు ఎవరూ ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. ఆసుపత్రి సూపరింటెండ్ శ్రీధర్ మరో 10 మంది వైద్యబృందం అందుబాటులో ఉంటూ బాధితులకు మెరుగైన సేవలందిస్తారని పేర్కొన్నారు.

రాజన్న ఆలయానికి ప్రత్యేక బోర్డు!

- రూ.100కోట్లు దాటితే ఏర్పాటు
- ఏర్పాటు దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు
- ఐఏఎస్ అధికారిని నియమించే అవకాశం
- త్వరలోనే ఉత్తర్వులు


వేములవాడ రాజన్న ఆలయం

వేములవాడ: దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ రాజన్న ఆలయ పాలనలో రూపురేఖలు మారనున్నాయి. ఆదాయానికి.. బోర్డుకు సంబంధం ఉండడంతో ఏటా రూ.100కోట్లు ఆదాయం దాటే ఆలయాలకు ప్రత్యేక బోర్డు ఏర్పాటు చేయాలనే నిబంధన రాజన్న ఆలయానికి వర్తించనుంది. దీంతో వేములవాడ శ్రీరాజరాజేశ్వస్వామి ఆలయ ప్రత్యేక బోర్డు ఏర్పాటు దిశగా అడుగులు పడుతున్నాయి. దీనికి ఐఏఎస్ అధికారిని బాధ్యులుగా నియమించే అవకాశం ఉంటుంది.

గతంలో బోర్డులు ఇలా..

వేములవాడ రాజన్న ఆలయం పాలనకు సంబంధించి కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. 1952లో కలెక్టర్‌ను చైర్మన్‌గా, ఐదుగురు సభ్యులతో ఆలయ బోర్డు ఏర్పాటైంది. 1956, 1958, 1962 సంవత్సరాల్లో మళ్లీ ఏర్పాటు చేశారు. 1967 నుంచి ప్రతీ రెండేళ్లకు కమిటీ మారుతూ వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అది నిలిచిపోయింది.

ప్రత్యేక బోర్డుకు ప్రభుత్వం కసరత్తు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.100 కోట్లకుపైగా ఆదాయం గల ఆలయాలకు టీటీడీ తరహాలో ప్రత్యేక బోర్డులు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈప్రక్రియలో వేములవాడ రాజన్న ఆలయం పేరు కూడా పరిశీలనలో ఉన్నట్లు వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్ సూత్రప్రాయంగా వెల్లడించారు.

స్వయంప్రతిపత్తితో బోర్డు

వేములవాడ ఆలయానికి ప్రత్యేక బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. ఈక్రమంలో కొత్తతరం రానుంది. బోర్డుసభ్యులతో స్వయం ప్రతిపత్తి కల్పించే దిశలో చర్చలు చేపట్టనున్నారు. త్వరలోనే బోర్డు ఏర్పాటు జరగనున్నట్లు అధికార పార్టీలో చర్చ మొదలైంది. ఆలయ పాలనలో క్రియాశీలతకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఐఏఎస్ స్థాయి అధికారి నేతృత్వంలో బోర్డు ఏర్పాటు, స్వయం ప్రతిపత్తితో వ్యవస్థ తీసుకురావాలని ప్రభుత్వం యోచిస్తోంది. దీంతో ఆలయ పాలనలో స్వతంత్ర అధికార దిశగా ముందడుగు వేయబోతోంది. పాలన లోపాలకు ఈ కొత్తబోర్డు కృషి చేస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ఐఏఎస్ అధికారి నేతృత్వం, భక్తులకు పారదర్శక పాలన అందించాలన్న దిశలో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తుంది.

రూ.100 కోట్లు దాటిన ఆలయాలకు ప్రత్యేక బోర్డు



రాష్ట్రంలో రూ.100కోట్ల ఆదాయం దాటిన ఆలయాలకు స్వయం ప్రతిపత్తి కల్పిస్తూ ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేయాలన్న ఆలోచనల్లో ప్రభుత్వం ఉంది. యాదగిరిగుట్ట తరహాలో వేములవాడ రాజన్నకు సైతం బోర్డు ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు. రాజన్న ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు, ఇదే పద్ధతిలో పట్టణం అభివృద్ధిపై సైతం కృషి చేస్తాం.

– ఆది శ్రీనివాస్, ప్రభుత్వవిప్